మేటి భవిష్యత్తు సొంతం చేసుకోవడానికి ప్రొఫెషనల్ కోర్సులే చదవాల్సిన అవసరం లేదు. ఉన్నతస్థాయి అవకాశాలను అందుకోవడానికి ఈ చదువులొక్కటే ప్రామాణికం కాదు. సాధారణ డిగ్రీలతోనూ సంచలనం సృష్టించవచ్చు. ఇంటర్మీడియట్ తర్వాత దేశంలో ఎక్కువమంది బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లోనే చేరుతున్నారు. ఇప్పుడీ చదువులు కొత్త సబ్జెక్టులు, వైవిధ్య కాంబినేషన్లతో విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ఉద్యోగాలు, ఉన్నత విద్యకూ దారి చూపుతున్నాయి!

సాదా డిగ్రీతోనూ.. అసాధారణ భవిత!

దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) స్థాయిలో చేరుతోన్న కోర్సుల్లో బీఏ, బీఎస్సీ, బీకాంలవే మొదటి మూడు స్థానాలు. ఈ మూడింటిలోనూ ఇటీవల బీకాంలో చేరుతోన్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. బీఏ, బీకాం, బీఎస్సీల్లో దేశవ్యాప్తంగా సుమారు 400 గ్రూపు కాంబినేషన్లు ఉన్నాయి. తాజా పరిణామాలకు అనుగుణంగా సబ్జెక్టులను తీర్చిదిద్దడం, కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం, వైవిధ్య కాంబినేషన్లకు అవకాశం కల్పించడం.. ఈ కారణాలతో ఇవి ఆదరణ పొందుతున్నాయి. తక్కువ వ్యవధిలో, తక్కువ ఖర్చుతో పూర్తికావడం, కళాశాలలు దగ్గరగా ఉండటం, పోటీ పరీక్షలు, ఉన్నత విద్యకు ఉపయోగపడటం...ఇవన్నీ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ప్రొఫెషనల్ కోర్సుల్లో పేరొందిన ప్రైవేటు విశ్వవిద్యాలయాలు సైతం ప్రధాన ప్రాంగణాల్లో కొత్త కాంబినేషన్లతో సాధారణ డిగ్రీ కోర్సులను అందిస్తున్నాయి. డిగ్రీతోపాటు సివిల్ సర్వీసెస్, పోటీ పరీక్షలు, సర్టిఫికేషన్ కోర్సులకు సమగ్ర శిక్షణా అందిస్తున్నాయి.

ఆనర్స్ కోర్సులు...

దేశంలో బీఏ కోర్సుదే పైచేయి. ఇంటర్మీడియట్ అన్ని గ్రూపుల విద్యార్థులూ బీఏలో చేరవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం బీకాంకు ప్రాధాన్యం లభిస్తోంది. ఈ కోర్సులోకి ఇంటర్‌లో కామర్స్/మ్యాథ్స్ సబ్జెక్టులు చదివినవారికి అవకాశం ఉంటుంది. ఐఐటీలు, ఎన్ఐటీలు, డీమ్డ్ విద్యా సంస్థల్లో అవకాశం దక్కడం, తెలుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగ్‌లో ఎక్కువ సీట్లు ఉండటంతో బీఎస్సీలో చేరే మ్యాథ్స్ విద్యార్థుల సంఖ్య గతంతో పోలిస్తే తగ్గుతోంది. దాదాపు డిగ్రీ కళాశాలలన్నీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందిస్తున్నాయి. పాపులర్ కాంబినేషన్లు అన్ని సంస్థల్లోనూ ఉన్నాయి. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు ఆసక్తి, భవిష్యత్తు లక్ష్యాలకనుగుణంగా గ్రూపుతోపాటు సబ్జెక్టుల కాంబినేషన్ ఎంచుకోవాలి. భవిష్యత్తులో పీజీ కోర్సుల్లో చేరడానికి యూజీలో ఆ సబ్జెక్టు చదివుండడం తప్పనిసరి. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని యూజీ సబ్జెక్టుల కాంబినేషన్ ఎంచుకోవాలి.

> రెండు తెలుగు రాష్ట్రాల్లో డిగ్రీ ప్రవేశాల క్రతువు ప్రారంభమైంది. అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. తెలంగాణలో సుమారు వెయ్యి కళాశాలల్లో 200కు పైగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ద్వారా ప్రవేశం లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ)తో డిగ్రీ కోర్సుల్లోకి చేరవచ్చు.

కొన్ని సంస్థలు ఆనర్స్ విధానంలో బ్యాచిలర్ డిగ్రీలు అందిస్తున్నాయి. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 160 క్రెడిట్లు ఉంటాయి. వీరు నాలుగో ఏడాది ఆ సబ్జెక్టులో పరిశోధన కొనసాగించవచ్చు.ఈ తరహా చదువుల్లో ఎంపిక చేసుకున్న సబ్జెక్టులో అదనపు ప్రావీణ్యం పొందవచ్చు. ఏదైనా సబ్జెక్టుపై ప్రత్యేక ఆసక్తి ఉన్నవారు, ఆ సబ్జెక్టులో ఉన్నత విద్యను ఆశిస్తున్నవాళ్లు ఆనర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. మేజర్, మైనర్ సబ్జెక్టులు ఉంటాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఇంటర్ మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఇంటర్ మార్కులు లేదా పరీక్షలో చూపిన ప్రతిభతో తీసుకుంటున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలన్నీ (సెంట్రల్ యూనివర్సిటీలు) యూజీ కోర్సులు అందిస్తున్నాయి. సీయూసెట్ ప్రతిభతో అవకాశం కల్పిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. తెలంగాణలో సుమారు వెయ్యి కళాశాలల్లో 200కు పైగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ద్వారా ప్రవేశం లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ)తో డిగ్రీ కోర్సుల్లోకి చేరవచ్చు. కళాశాలు, కోర్సులు, సీట్లు, ఫీజులకు సంబంధించి పూర్తి వివరాలు ఈ వెబ్‌సైట్ల నుంచి పొందవచ్చు. రెండు రాష్ట్రాల్లోనూ డిగ్రీ ప్రవేశాల క్రతువు ప్రారంభమైంది. డిగ్రీ కళాశాలలకు న్యాక్ గ్రేడ్‌లను కేటాయించింది. వీటి ప్రకారం వరుసగా.. ఎ++, ఎ+, ఎ, బీ++, బీ+, బీ, సీ ముఖ్యమైనవి. కళాశాల ఎంపికలో ఈ గ్రేడులను ప్రామాణికంగా తీసుకోవచ్చు.

బి.ఎ.

ఈ కోర్సులో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల కాంబినేషన్‌కు బాగా పేరు. సివిల్స్, గ్రూప్-1,2 తదితర పోటీ పరీక్షల ఆశావహులు, భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవాలని ఆశించేవారు వీటివైపు మొగ్గు చూపవచ్చు. టూరిజం, సైకాలజీ, సోషల్ వర్క్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రొపాలజీ, జాగ్రఫీ, ఫిలాసఫీ, విమెన్ స్టడీస్ అండ్ మేనేజ్‌మెంట్, పాపులేషన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్ అండ్ డ్యూటీస్, హాస్పిటాలిటీ... ఇలా ఎంచుకోవడానికి ఎన్నో సబ్జెక్టులు బీఏలో అందుబాటులో ఉన్నాయి. ఈస్టటిక్స్ అండ్ బ్యూటీ థెరపీ, డిజిటల్ మీడియా అండ్ డిజైన్ కోర్సులనూ బీఏలో భాగంగా కొన్ని సంస్థలు అందిస్తున్నాయి.

బి.ఎస్సీ.

ఈ గ్రూపులో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒకప్పుడు ఎంతో పాపులర్. ఇంటర్మీడియట్ మ్యాథ్స్ విద్యార్థులకు.. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ టాప్ కాంబినేషన్‌గా చెప్పుకోవచ్చు. ఈ సబ్జెక్టులపై పట్టున్నవారు భవిష్యత్తులో మేటి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఎక్కువమంది విద్యార్థులు చేరుతోన్న వాటిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ ముందుంటుంది. ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, జియాలజీ..ఇలా ఎన్నో సబ్జెక్టులను మ్యాథ్స్ విద్యార్థులు ఎంచుకోవచ్చు. ఇప్పుడు బీఎస్సీలోనూ డేటా సైన్స్, డేటా ఎనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్...వంటి వైవిధ్య కోర్సులు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, డీమ్డ్ సంస్థలు అందిస్తున్నాయి. కొన్ని సంస్థలు నాలుగేళ్ల వ్యవధితో బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్) ఆనర్స్ విధానంలో అందిస్తున్నాయి. ఐఐటీ మద్రాస్ అందించే ఆన్‌లైన్ బీఎస్సీ కోర్సు లోనూ చేరవచ్చు. బైపీసీ స్ట్రీమ్‌లో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మొదటి నుంచీ ఆదరణ పొందుతున్నాయి. వీరు మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, ఫారెస్ట్రీ, జెనెటిక్స్, సీడ్ టెక్నాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితర సబ్జెక్టులను ఎంచుకోవచ్చు.

బి.కామ్

కాంబినేషన్లు తక్కువే. కామర్స్ సబ్జెక్టు ప్రధానాంశంగా ఈ కోర్సు రూపొందడమే కారణం. ఇందులో పలు స్పెషలైజేషన్లు ఉన్నాయి. బీకాం (రెగ్యులర్/ ఆనర్స్/ ట్యాక్సేషన్/ కంప్యూటర్స్/ ఈ-కామర్స్/ ఇంటర్నేషనల్ బిజినెస్/ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్/ అడ్వర్టైజింగ్ అండ్ సేల్స్ మేనేజ్‌మెంట్/ ఫారిన్ ట్రేడ్/ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) వీటిలో ఏదైనా కోర్సు ఎంచుకోవచ్చు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు బీకాం జనరల్, ఆనర్స్‌లతోపాటు అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు ఉన్న బీకాం ఆనర్స్ + ఏసీసీఏ, బీకాం ఆనర్స్ + సీఐఎంఏ కాంబినేషన్లతో కోర్సులు అందిస్తున్నాయి. అసోషియేషన్ ఆఫ్ ఛార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ)లో చేరినవారు 13 పేపర్లు పూర్తిచేయాలి. అయితే బీకాం ఆనర్స్ విద్యార్థులకు వీటిలో 6 పేపర్ల నుంచి మినహాయింపు లభిస్తుంది. బీకాం ఆనర్స్ + ఏసీసీఏ కోర్సు తెలుగు రాష్ట్రాల్లో కేవలయూ, గీతంతో పాటు మరికొన్ని సంస్థలు అందిస్తున్నాయి. విద్యార్థులు బీకాం చదువుతూ.. సీఎంఏ, సీఏ, సీఎస్ తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరవచ్చు.

స్వరూపం...

బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సు వ్యవధి మూడేళ్లే. ఆనర్స్‌లో కొన్ని చోట్ల నాలుగేళ్లు. పరీక్షలు సెమిస్టర్ విధానంలో ఆరు నెలలకు ఒకసారి నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలు చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) అనుసరిస్తున్నాయి. అన్ని డిగ్రీ కళాశాలల సిలబస్, విధివిధానాలు దాదాపు ఒకేలా ఉంటాయి. సెమిస్టర్ మధ్యలోనూ మిడ్ సెమ్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి సెమిస్టర్‌లోనూ సబ్జెక్టులవారీ క్రెడిట్‌లు ఉంటాయి.

డిగ్రీ తర్వాత...

డిగ్రీ కోర్సుల్లో చేరినవారు వ్యక్తిగత ఆసక్తులను బట్టి భవిష్యత్తులో భిన్న మార్గాలను ఎంచుకోవచ్చు. సంబంధిత కోర్సులకు అనుబంధంగా ఉన్నత విద్యను కొనసాగించడం, మేనేజ్‌మెంట్ లేదా ప్రొఫెషనల్ కోర్సుల్లో (ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్, లా...) చేరడం, కేంద్రం, రాష్ట్ర స్థాయుల్లో నిర్వహించే పలు ఉద్యోగాలకు సన్నద్ధం కావడం..వీటిలో ముఖ్యమైనవి. ఎవరికివారు తమ భవిష్యత్తు ఆశయాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చిన వారు భవిష్యత్తులో కోరుకున్న స్థానాన్ని అందుకోవచ్చు.

ప్రాచుర్యం పొందిన సబ్జెక్టు కాంబినేషన్లు

ఎంపీసీతో..

- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ
- మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్
- మ్యాథ్స్, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్
- మ్యాథ్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్
- మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్
- మ్యాథ్స్, ఫిజిక్స్, జియాలజీ
- మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ (ఇంటర్‌లో మ్యాథ్స్ చదివిన ఇతర గ్రూపుల వారూ ఇందులో చేరవచ్చు)

బైపీసీతో..

- బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ
- మైక్రో బయాలజీ, జెనెటిక్స్, కెమిస్ట్రీ
- బయోటెక్నాలజీ, బోటనీ, కెమిస్ట్రీ
- బయోటెక్నాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ
- బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ
- బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, మైక్రోబయాలజీ
- ఆక్వాకల్చర్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, జువాలజీ
- కెమిస్ట్రీ, జువాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్
- కెమిస్ట్రీ, బోటనీ, అప్లైడ్ న్యూట్రిషన్
- ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ

ఆర్ట్స్..

- హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్
- హిస్టరీ, సోషియాలజీ, జాగ్రఫీ
- సైకాలజీ, సోషియాలజీ, ఫిలాసఫీ
- సైకాలజీ, మార్కెటింగ్, ఇంగ్లిష్ లిటరేచర్
- మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఇంగ్లిష్ లిటరేచర్, పొలిటికల్ సైన్స్
- హిస్టరీ, ఇంగ్లిష్ లిటరేచర్, పొలిటికల్ సైన్స్
- ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్
- హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్
- ఇంగ్లిష్ లిటరేచర్, జర్నలిజం, పొలిటికల్ సైన్స్
- సోషల్ వర్క్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో...

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం సంప్రదాయ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు. ఎంపికైనవారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలుంటాయి.

1. **శాస్త్రి (బీఏ) మూడేళ్లు:** విభాగాలు- క్రమంత, ప్రతిష్ఠాంత, వేదభాష్య, కల్ప, మీమాంస. వయసు: 18-22 ఏళ్ల మధ్య ఉండాలి.
2. **ఆచార్య (ఎంఏ):** విభాగాలు- ఘనంత, పౌరోహిత్య, వేదభాష్య, మీమాంస, కల్ప. వయసు: 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
3. **అభిజ్ఞ కోర్సులు. వయసు:** 16 ఏళ్ల నిండి ఉండాలి.
4. **డిప్లొమా కోర్సులు:** టెంపుల్ మేనేజ్‌మెంట్, జ్యోతిష, వాస్తు, మాన్యుస్క్రిప్టాలజీ. కనీస వయసు: 20 సం. నిండి ఉండాలి.
5. **సర్టిఫికెట్ కోర్సులు:** అతీంద్రీయ విజ్ఞానం, గృహార్చనం, ఇండియన్ ఫిలాసఫీ, వేదిక్ సైన్సెస్, పురాణోక్త కర్మకాండ, పౌరాణిక శిక్షణ. కనీస వయసు: కోర్సును బట్టి 18, 20 ఏళ్ల నిండి ఉండాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.06.2023.
వెబ్‌సైట్: http://www.svvedicuniversity.ac.in/

ఉస్మానియాలో డిప్లొమా కోర్సులు

ఉస్మానియా యూనివర్సిటీలోని ఫ్రెంచ్, జర్మన్ విభాగాలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

1. ఫ్రెంచ్/ జర్మన్‌లో డిప్లొమా కోర్సులు (జూనియర్/ సీనియర్): వ్యవధి నాలుగు నెలలు
2. ఫ్రెంచ్/ జర్మన్‌లో అడ్వాన్స్‌డ్ డిప్లొమా: వ్యవధి ఏడాది

అర్హత: జూనియర్ డిప్లొమాకు ఇంటర్మీడియట్, సీనియర్ డిప్లొమాకు జూనియర్ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమాకు సీనియర్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
దరఖాస్తుకు చివరి తేదీ: 08-07-2023.
వెబ్‌సైట్: https://www.osmania.ac.in/

చండీగఢ్‌లో బీఎస్సీ నర్సింగ్

పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్.. బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

1. బీఎస్సీ నర్సింగ్ (నాలుగేళ్లు): 93 సీట్లు (మహిళలకు)

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో 10+2 ఉత్తీర్ణులై ఉండాలి.

2. బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్-బేసిక్)- రెండేళ్లు: 62 సీట్లు (కో-ఎడ్యుకేషన్)

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో 10+2తో పాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: ప్రవేశ పరీక్ష ద్వారా.
దరఖాస్తు రుసుము: ఎస్సీ/ఎస్టీ కేటగిరీలకు రూ.1200. ఇతరులకు రూ.1500. దివ్యాంగులకు ఫీజు మినహాయింపు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.06.2023.
కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష తేదీ: 04.08.2023.
ఫలితాల వెల్లడి: 12.08.2023. **కౌన్సెలింగ్ తేదీ:** 23.08.2023.
వెబ్‌సైట్: https://pgimer.edu.in/PGIMER_PORTAL/PGIMERPORTAL/home.jsp

అప్రెంటిస్‌షిప్

ఐఆర్‌సీటీసీలో అప్రెంటిస్ ట్రైనీ పోస్టులు

ఐఆర్‌సీటీసీ, ఈస్ట్ జోన్ (కోల్‌కతా) 25 కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ అప్రెంటిస్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. **శిక్షణ వ్యవధి:** 12 నెలలు.
వయసు: 01.06.2023 నాటికి 15 - 25 ఏళ్ల మధ్య ఉండాలి.
పని ప్రదేశం: కోల్‌కతా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 29.06.2023. **వెబ్‌సైట్:** https://irctc.com/

విదేశాల్లో పీజీ..

బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో చేయాలనుంది. విదేశాల్లో పీజీ చేయాలంటే పాటించాల్సిన విధానాలేమిటి? – కె.నవీన్‌కుమార్

■ విదేశాల్లో పీజీ చేయాలంటే ముందుగా ఏ దేశంలో, ఏ సబ్జెక్ట్‌లో, ఏ యూనివర్సిటీలో చదవాలనుకొంటున్నారో నిర్ణయించుకోండి. ఆ తరువాత, ఆయా యూనివర్సిటీల వెబ్‌సైట్‌లకు వెళ్ళి, అక్కడ పీజీ చదవడానికి అవసరమైన ప్రవేశ పరీక్షలు, కావాల్సిన స్కోర్లు లాంటి వాటిని తెలుసుకోవడం శ్రేయస్కరం. ఈ క్రమంలో, విదేశాల్లో చదువుతున్న మీ సీనియర్‌ల సలహాలు, సూచనలు సరైన నిర్ణయం తీసుకోవడానికి దోహదపడతాయి. విదేశాల్లో పీజీ చేయడం ఖర్చుతో కూడుకొన్న విషయం కాబట్టి ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం చాలా ముఖ్యం. మీ కుటుంబానికి అంత స్థోమత లేకపోతే బ్యాంకు రుణం కోసం ప్రయత్నించండి. భారత ప్రభుత్వ విదేశీ విద్యా సహకార స్కాలర్‌షిప్‌ల గురించి, విదేశీ యూనివర్శిటీల్లో చదువుతూ, సంపాదించడంలో ఉన్న సాధ్యాసాధ్యాలను అంచనా వేయండి.

యూఎస్‌లో పీజీ చేయాలంటే ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యం తెలుసుకొనే ఐఈఎల్‌టీఎస్/ టోఫెల్ లాంటి పరీక్షల్లో మంచి స్కోరు పొందాలి. కొన్ని యూనివర్సిటీలు ఈ పరీక్షలతో పాటు జీఆర్ఈ లాంటి పరీక్షల్లో వచ్చిన స్కోరును బట్టి ప్రవేశాలు/ఫెలోషిప్‌లు ఇస్తున్నాయి. వివిధ విదేశీ యూనివర్సిటీలు రకరకాల నిబంధనలను ఆధారంగా చేసుకొని పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తాయి. విదేశీ యూనివర్శిటీల్లో ప్రవేశానికి, పైన పేర్కొన్న అంశాలతో పాటు, మీ కళాశాల అధ్యాపకులు రాసే రిఫరెన్స్ లెటర్స్, మీరు రాసే స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో బయోటెక్నాలజీలో పీజీ చేయాలంటే కూడా పైన పేర్కొన్న చాలా అంశాలు మీకు వర్తిస్తాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజేశ్వర్, కెరియర్ కౌన్సెలర్

గణితంపై మమకారమే గెలుపు సోపానం

ఇంజినీర్ కావాలన్న లక్ష్యాన్ని ఎనిమిదో తరగతి నుంచే నిర్దేశించుకున్నాడు. తల్లిదండ్రులు రాజేశ్వర్ రెడ్డి, భాగ్యలక్ష్మిల ప్రోత్సాహం, అన్న ప్రేరణతో ఐఐటీలో చదవాలని నిర్ణయించుకున్నాడు. లక్షలమంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసినా...అర్జునుడికి చెట్టుపై ఉన్న పక్షి కన్ను మాత్రమే కనిపించినట్టు.. మేటి ర్యాంకుపై దృష్టి కేంద్రీకరించి జాతీయస్థాయిలో టాపర్‌గా విజయ పతాకం ఎగరేశాడు తెలంగాణా కుర్రాడు వావిలాల చిద్విలాస్ రెడ్డి. తన సన్నద్ధత విశేషాలను 'చదువు'తో ఇలా పంచుకున్నాడు..

అఖిల భారత స్థాయిలో కచ్చితంగా ర్యాంకు వస్తుందని తెలుసు. ఎందుకంటే మా కళాశాల నిర్వహించే పరీక్షల్లో టాప్ త్రీలో ఉన్నా. కళాశాలలో బోధించే పాఠాలు, వారు ఇచ్చే పాఠ్యపుస్తకాలు, మెటీరియల్‌తోపాటు మరిన్ని పుస్తకాలు చదవడం, గణితశాస్త్రంపై పట్టు సాధించేందుకు ఏం చేయాలని ఆలోచించడం- ఇలా అన్నీ వరుసక్రమంలో చేయడంతో నాపై నాకు నమ్మకం పెరిగింది.

మెయిన్స్‌కు సరిగ్గా నాలుగు నెలల ముందు గట్టిగా ప్రిపేరవ్వాలని నిర్ణయించుకున్నా. ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు, జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సమాంతరంగా సిద్ధమయ్యా. రోజుకు పదిగంటల పాటు కచ్చితంగా చదవాలనుకున్నా.. ప్రణాళిక ప్రకారం సిద్ధమయ్యాను. గత మెయిన్స్ ప్రశ్నపత్రాలను పరిశీలించి ఎలాంటి ప్రశ్నలు మళ్లీ మళ్లీ వస్తున్నాయి? ఎందుకు వస్తున్నాయని ఆలోచించా. ఆ ప్రశ్నలున్న పాఠాలను బాగా చదివి అర్థం చేసుకున్నా.

దాదాపు ప్రతిరోజూ మెయిన్స్ పరీక్ష రాసేవాణ్ణి. 300కు 298, 299 మార్కులు వచ్చేవి. ఇంకొక్క మార్కు ఎలా తగ్గింది? ఎందుకు తగ్గిందని విశ్లేషించుకుని మిగిలిన పరీక్షలు రాసేవాడిని. నెలరోజుల్లో 300కు 300 మార్కులు వచ్చాయి. అప్పటి నుంచి ప్రతి పరీక్షా మెయిన్స్ పరీక్షగా భావించి సిద్ధమయ్యా. మెయిన్స్‌లో అనుకున్న ఫలితాలు వచ్చాక ఒక వారం రోజులు విశ్రాంతి తీసుకున్నా. తర్వాత అడ్వాన్స్‌డ్ పరీక్షకు ప్రిపరేషన్ ప్రారంభించా.

● మెయిన్స్ పరీక్షలకు సంబంధించి చాలా వెబ్‌సైట్లలో ప్రత్యేకమైన ప్రశ్నపత్రాలుంటాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని ప్రాక్టీస్ చేస్తూ ఉంటే... వంద పర్సంటైల్ సాధించేందుకు అవకాశముంటుంది. ● మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సిద్ధమయ్యేవారు ఎవరైనా సరే... ఎంతసేపు చదివారన్నది ప్రామాణికం కాదు. కొందరు పదిగంటలు చదవొచ్చు. మరికొందరు ఆరుగంటలు చదువుకోవచ్చు. ఎవరెంతసేపు చదువుకున్నా... మనకు సబ్జెక్టులు ఎంతవరకూ అర్థమయ్యాయన్నది తెలుసుకోవాలి. ● నరేంద్ర అవస్థి, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో పాటు తెలుగు అకాడమీ రసాయనశాస్త్ర పుస్తకాల్లో విస్తృత సమాచారం ఉంది. వీటిన్నింటినీ చదివి అర్థం చేసుకుంటే ఎలాంటి విద్యార్థులకైనా మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో 99 పర్సంటైల్ వచ్చేందుకు అవకాశాలున్నాయి. ● ప్రశ్నలు సాధన చేస్తున్నప్పుడు ఎక్కడ తప్పులు జరుగుతున్నాయి, ఏకాగ్రత ఎక్కడ తప్పుతోందని విశ్లేషించుకున్నా.. సరైన ట్రాక్‌లో వెళ్లాలని నిర్ణయించుకున్నా.

గణితంపై మమకారం పెంచుకుంటే..

జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలన్నా... పర్సంటైల్ బాగా రావాలన్నా గణిత శాస్త్రంపై మమకారం పెంచుకోవాలి. ఇంటర్ గణితశాస్త్రంలో ప్రతి అధ్యాయంపై దృష్టి కేంద్రీకరించాలి. మంచినీళ్ల తాగినంత సులభంగా ప్రశ్నలకు సమాధానాలను రాయాలి. ఇందుకోసం పాఠ్యపుస్తకాలు, అఖిలభారత సాంకేతిక విద్యా మండలి పుస్తకాలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అందుబాటులో ఉంచిన మెటీరియల్‌ను శ్రద్ధగా చదువుకోవాలి. సందేహం వస్తే.. అధ్యాపకులను అడిగి వెంటనే అనుమానాలను తొలగించుకోవాలి. దీంతోపాటు ఏయే అధ్యాయాలు సులభంగా అర్థమవుతున్నాయి? ఏ అంశాలు కొంత కష్టంగా ఉన్నాయి? అని విభజించుకుని సులభంగా అర్థమవుతున్న అధ్యాయాలను మరింత వేగంగా అర్థం చేసుకోవాలి. అదనంగా మిగిలిన సమయాన్ని కాస్త కష్టం అనిపించే అంశాలపై దృష్టి పెట్టాలి. గణితశాస్త్రంలో ఉన్న సౌలభ్యం ఏంటంటే మార్కులు వందకు వంద వస్తాయి. దీంతోపాటు లెక్కలు చేయడంలో ప్రావీణ్యం ఉంటే.. భౌతిక రసాయన శాస్త్రాల్లోని లెక్కలూ, సమీకరణాలూ సులభంగా చేసేందుకు వెసులుబాటు లభిస్తుంది.

భౌతికశాస్త్ర థియరీపై దృష్టి

భౌతికశాస్త్రం చదువుకుంటున్నా... వేర్వేరు పుస్తకాల నుంచి మరింత సమాచారం సేకరిస్తున్నా... దాన్ని మనచుట్టూ జరిగే అంశాలకు అన్వయించుకోవాలి. చిన్న చిన్న అంశాలను అర్థం చేసుకుంటే.. చదువుకునేకొద్దీ మిగిలిన

అధ్యాయాలు సులభంగా అర్థమవుతాయి. ప్రధానంగా థియరీ పార్ట్‌పై దృష్టి కేంద్రీకరించాలి. తెలుగ